RNI. No. APTEL/2011/41055





# ప్రభాత సమాచారం

తెలంగాణ తెలుగు దినపత్రిక






సంపుటి : 13 సంచిక : 196 | ఆదిలాబాద్ | ఎడిటర్ - సయ్యద్ కరీం | శనివారం, 18 జనవరి 2025 | పేజీలు : 4 | వెల : 2/-

# కేబినెట్ విస్తరణకు గ్రీన్ సిగ్నల్..!

## సీఎం రేవంత్‌కు క్లారిటీ ఇచ్చిన హైకమాండ్!!




హైదరాబాద్ : సీఎం రేవంత్‌రెడ్డి విదేశీ పర్యటన తర్వాత కేబినెట్ విస్తరణ జరిగే అవకాశం ఉందని ప్రచారం జరుగుతున్నది. ఇద్దరు లేదా ముగ్గురిని మంత్రివర్గంలోకి తీసుకుని, మిగతా ఖాళీలను లోకల్ బాడీ ఎలక్షన్స్ తర్వాత భర్తీ చేయొచ్చని తెలుస్తున్నది. ఈ మేర కు ఢిల్లీ పర్యటన సందర్భంగా సీఎం రేవంత్‌కు కాంగ్రెస్ అధిష్టానం క్లారిటీ ఇచ్చినట్టు సమాచారం.

అయితే, ఎవరెవరిని మంత్రివర్గంలోకి తీసుకోవాలనే అంశంపై ఇప్పటికే రేవంత్ జాబితాను ఢిల్లీ పెద్దలకు సమర్పించినట్టు తెలిసింది. ఆయన విదేశీ పర్యటన ముగించుకుని హైదరాబాద్‌కు వచ్చిన తర్వాత విస్తరణకు ముహూర్తం ఖరారవుతుందని సమాచారం.

**అటు విమర్శలు, ఇటు అలకలకు చెక్ :** కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి డిసెంబరు 7, 2024తో ఏడాది పూర్తయింది. కాని ఇంతవరకు ఖాళీగా ఉన్న 6 మంత్రి పదవులను భర్తీ చేయకపోవడంతో విపక్షాల నుంచి విమర్శలు వస్తున్నాయి. అలాగే ఆశావాహులు సైతం కొన్ని సందర్భాల్లో అలక పూనుతున్నారనే టాక్ ఉంది. అసెంబ్లీ ఎన్నికలకు ముందు తమకు ఇచ్చిన హామీ ఏమైందంటూ ఏఐసీసీ నేతల వద్ద గుర్తు చేస్తున్నట్టు తెలుస్తున్నది. దీనితో కేబినెట్ విస్తరణ చేపట్టేందుకు రేవంత్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్టు తెలిసింది. ప్రస్తుతం రేవంత్ విదేశీ పర్యటనలో ఉన్నారు. ఆయన ఈ నెల 25న హైదరాబాద్‌కు తిరిగి రానున్నారు. రిపబ్లిక్ డే (జనవరి 26) సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తోన్న రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు పథకాలను ప్రారంభించనున్నారు. ఆ తర్వాత ఆయన కొన్ని జిల్లాల్లో పర్యటించేందుకు ప్లాన్ చేసుకున్నారు. ఆ కార్యక్రమం మధ్యలోనే కేబినెట్ విస్తరించే యోచనలో ఉన్నట్టు ప్రచారం ఉంది. ఒకవేళ ఇప్పుడు విస్తరణ చేయకపోతే స్థానిక సంస్థల ఎన్నికలు ముగిసేవరకు పెండింగ్‌లో పడే చాన్స్ ఉందని చర్చ జరుగుతున్నది.

**సామాజిక సమీకరణనే సమస్య :** ప్రస్తుతం కేబినెట్‌లో సీఎం రేవంత్‌తో కలుపుకుని 12 మంది ఉండగా, మరో ఆరు ఖాళీలు ఉన్నాయి. ఎవరెవరిని కేబినెట్‌లోకి తీసుకోవాలనే అంశంపై సుదీర్ఘంగా కసరత్తు చేసినట్టు తెలుస్తున్నది. రెడ్డి సామాజికవర్గం నుంచే ఎక్కువ మంది ఎమ్మెల్యేలు మంత్రి పదవుల కోసం పోటీ పడుతున్నారు. నిజామాబాద్ నుంచి సుదర్శన్‌రెడ్డి, నల్లగొండ జిల్లా నుంచి కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, రంగారెడ్డి జిల్లా నుంచి మల్‌రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్‌రెడ్డి రేసులో ఉన్నారు. ఇందులో ఎవరిని కాదని పక్కనపెట్టినా ఇబ్బందులు వచ్చే చాన్స్ ఉంది. అందుకని ముందుగా ఒక బీసీ, ఒక రెడ్డి, ఒక మైనార్టీ వర్గానికి మంత్రి పదవులు ఇచ్చి, మిగతా వాటిని కొంత కాలం తర్వాత భర్తీ చేయొచ్చని అధిష్టానం సూచించినట్టు తెలుస్తున్నది.

ఒకవేళ డిప్యూటీ స్పీకర్, చీఫ్ విప్ పదవులు తీసుకునేందుకు రెడ్డి ఎమ్మెల్యేలు ఒప్పుకుంటే, ఒకేసారి 6 మందితో మంత్రివర్గ విస్తరణ జరిగే అవకాశం ఉందని చర్చ కూడా జరుగుతున్నది. విస్తరణకు ఇప్పుడు ముహూర్తం కుదరకపోతే లోకల్ బాడీ ఎలక్షన్స్ పూర్తయ్యేవరకు నిరీక్షించక తప్పదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



# రైతులు, రైతు కూలీలు అలెర్ట్..

## రైతు భరోసా సర్వే....

## మిస్సయితే డబ్బు రావు..!

హైదరాబాద్ : రైతు భరోసా అందించే ప్రయత్నంలో భాగంగా వ్యవసాయ భూములు Rythu Bharosa Survey, వ్యవసాయేతర భూములు మరియు భూమిలేని వ్యవసాయ కుటుంబాలను గుర్తించడానికి Telangana రాష్ట్ర ప్రభుత్వం గురువారం నుండి విస్తృతమైన సర్వేలను ప్రారంభించింది. జనవరి 21 వరకు రెవెన్యూ మరియు వ్యవసాయ శాఖల సిబ్బందితో కూడిన ఉమ్మడి బృందాలు ఆరు రోజుల పాటు సర్వేలను నిర్వహిస్తాయి. కొత్త రేషన్ కార్డులు మరియు ఇందిరమ్మ గృహనిర్మాణ పథకానికి లబ్ధిదారులను గుర్తించడానికి ధృవీకరణ ప్రక్రియ కూడా ఏకకాలంలో నిర్వహించబడుతుంది.

సర్వే తర్వాత, జనవరి 21 నుండి గ్రామ సభలు ఏర్పాటు చేసి, ఫలితాలను మరియు ప్రాథమిక లబ్ధిదారుల జాబితాలను ప్రదర్శిస్తారు. ఈ సమావేశాల సమయంలో అభ్యంతరాలు తెలియజేయడానికి ప్రజలను ఆహ్వానిస్తారు. నిజమైన ఫిర్యాదులను అధికారులు పరిష్కరిస్తారు, ఏవైనా తప్పులను సరిదిద్దుతారు మరియు తదనుగుణంగా లబ్ధిదారుల జాబితాలను ఖరారు చేస్తారు.

ప్రధాన కార్యదర్శి ఎ. శాంతి కుమారి జిల్లా కలెక్టర్లతో జరిగిన టెలికాన్ఫరెన్స్ సందర్భంగా, లబ్ధిదారుల ఎంపికలో ఖచ్చితత్వం మరియు న్యాయబద్ధత యొక్క ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు.

**Rythu Bharosa Survey ఎకరానికి ఏడాదికి రూ.15 వేలు, రైతు కూలీలకు రూ.12 వేలు :** వ్యవసాయ భూములు కలిగి ఉన్న రైతులకు ఎకరానికి సంవత్సరానికి రూ.15,000 రైతు భరోసా, భూమిలేని వ్యవసాయ కుటుంబాలకు సంవత్సరానికి రూ.12,000 ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ గృహనిర్మాణం వంటి నాలుగు పథకాలు సమర్థవంతంగా మరియు పారదర్శకంగా అమలు అయ్యేలా చూడాలని ఆమె జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. ఈ పథకాల ప్రారంభ తేదీగా రాష్ట్ర ప్రభుత్వం జనవరి 26ని నిర్ణయించింది.ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కోసం, 2023-24లో జాతీయ ఉపాధి హామీ పథకం కింద కనీసం 20 రోజులు పనిచేసిన లబ్ధిదారులను, ముఖ్యంగా భూమిలేని వ్యవసాయ కార్మికులను గుర్తించి, వారి వివరాలను గ్రామ సభలలో ఆమోదించాలి. రేషన్ కార్డులు మరియు ఇందిరమ్మ ఇళ్ల కోసం, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా గ్రామాలు మరియు పట్టణ వార్డులలో లబ్ధిదారుల ముసాయిదా జాబితాలను ప్రదర్శించాలి. ప్రజల పరిశీలన మరియు అభ్యంతరాల తర్వాత జాబితాలను ఖరారు చేస్తారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ అధికార పరిధితో సహా పట్టణ ప్రాంతాలలో, అధిక సంఖ్యలో లబ్ధిదారులు ఉన్నందున ఖచ్చితమైన డేటా ఎంట్రీ మరియు క్షుణ్ణంగా ఫీల్డ్ వెరిఫికేషన్‌కు ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులకు సూచించబడింది. తప్పులను నివారించడానికి మరియు అర్హులైన లబ్ధిదారులకు మాత్రమే సహాయం అందేలా చూసుకోవడానికి అమలు ప్రక్రియను నిశితంగా పర్యవేక్షించాలని సంబంధిత శాఖల కార్యదర్శులను ఆమె కోరారు. అధికారులు తనిఖీ, సర్వే కోసం వచ్చినప్పుడు సంబంధిత పొలాల రైతు అందుబాటులో లేకపోతే, అధికారులు తయారుచేసిన లిస్టును గ్రామ సభల్లో ప్రకటిస్తారు. అప్పుడు మిస్సయిన రైతులు ఆ జాబితాను పరిశీలించి, ఏదైనా సమస్య ఉంటే అధికారులకు చెప్పొచ్చు. అప్పుడు వాళ్లు పరిశీలించి పరిష్కరిస్తారు.




జనవరి 31వ తేదీన మొదలై ఫిబ్రవరి 13వ తేదీ వరకు తొలి విడత బడ్జెట్ సమావేశాలు ఉంటాయి. రెండవ విడత సమావేశాలు మార్చి 10 నుంచి ఏప్రిల్ 4 వరకు కొనసాగనున్నాయి. తొలి రోజు బడ్జెట్ సమావేశాలను ఉద్దేశించి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రసంగిస్తారు. ఫిబ్రవరి1న కేంద్రం ఆర్థిక సంవత్సరం 2025-26కి సంబంధించిన పద్దును కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టనున్నారు. మార్చి 10వ తేదీ నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు బడ్జెట్ సమావేశాలు ఉంటాయి. ప్రధాన మంత్రి నేతృత్వంలోని ఎన్డీయే సర్కార్ మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత తొలిసారి ప్రవేశపెడుతున్న పూర్తి స్థాయి బడ్జెట్ కావడంతో ప్రాధాన్యం సంతరించుకుంది. ఈ బడ్జెట్‌లో కీలక నిర్ణయాలు తీసుకుంటారని అంచనా. అయితే మధ్య తరగతి ప్రజలు ఈసారి బడ్జెట్‌పై కోటి ఆశలు పెట్టుకున్నారు. వ్యక్తిగత ఆదాయపు పన్నులో మినహాయింపులు కల్పించాలని కోరుతున్నారు. ఈ క్రమంలో ఇన్‌కమ్ ట్యాక్స్ లిమిట్ పెంచుతారని, పన్ను శ్లాబుల్లో కీలక మార్పులు రానున్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. కాగా, నిర్మలా సీతారామన్ వరుసగా 8వ సారి బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రిగా రికార్డ్ సృష్టించనున్నారు. ఆమె కంటే ముందు అత్యధికసార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రుల్లో మొరార్జీ దేశాయ్ 10 సార్లు అగ్రస్థానంలో ఉన్నారు. ఆ తర్వాత పి.చిదంబరం 9 సార్లు, ప్రణబ్ ముఖర్జీ 8 సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టారు. అలాగే అత్యధిక సార్లు బడ్జెట్ ప్రవేశపెట్టిన మహిళా ఆర్థిక మంత్రిగా నిర్మలా సీతారామన్ నిలిచారు. రెండు మధ్యంతర బడ్జెట్లు, 6 పూర్తి స్థాయి బడ్జెట్లను నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టినవారు అవుతారు.

# సింగపూర్ లో రేవంత్ రెడ్డి బృందం బిజి.. బిజి...

## స్కిల్ వర్సిటీకి.. ఐటీఈ ప్రోత్సాహంస్కిల్స్ ట్రెయినింగ్‌కు సింగపూర్ పాఠ్యాంశాలు




సింగపూర్ : తెలంగాణ రైజింగ్ ప్రధాన ఎజెండాగా సింగపూర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ బృందం పర్యటిస్తోంది. ఈ టూర్‌లో మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉన్నతాధికారులతో కలిసి సింగపూర్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్‌ను సీఎం రేవంత్ సందర్శించారు. సింగపూర్ ఐటీఈలో సాంకేతిక నైపుణ్యాల అభివృద్ధి సహా 20కి పైగా విభిన్న డొమైన్‌ల పనితీరును ముఖ్యమంత్రి నేతృత్వంలోని ప్రతినిధి బృందం పరిశీలించింది. ఆయా రంగాల్లో పనిచేస్తున్న నిపుణులు, సిబ్బందితో రేవంత్ సంభాషించారు.

**కుదిరిన కీలక ఒప్పందం..** నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ.. సింగపూర్ ప్రభుత్వ ఆధీనంలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐటీఈ) సంస్థతో ఎంఓయూ కుదుర్చుకుంది. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్ బాబు, స్పెషల్ సీఎస్ జయేశ్ రంజన్ సమక్షంలో యూనివర్సిటీ వైస్ చాన్సలర్ సుబ్బారావు, ఐటీఈ డిప్యూటీ డైరెక్టర్ ఫాబియన్ చియాంగ్ ఈరోజు ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు.

**ఆన్‌లైన్, క్యాంపస్ శిక్షణ..** సింగపూర్ ఐటీఈ.. పదో తరగతి చదివే విద్యార్థుల స్థాయి నుంచి చదువు పూర్తి చేసిన యువత, ఆసక్తి ఉన్న ఏ వయసు వారికైనా.. పరిశ్రమలు, ఐటీ సంస్థల సహకారంతో జాబ్ రెడీ శిక్షణను ఇస్తుంది. 'స్కిల్స్ ఫర్ ఫూచర్, స్కిల్స్ ఫర్ లైఫ్' అనే నినాదంతో పనిచేస్తున్న ఐటీఈలో ప్రస్తుతం 28 వేల మంది శిక్షణ పొందుతున్నారు. మొత్తం వంద ఫుల్ టైమ్ కోర్సులకు ఆన్‌లైన్, క్యాంపస్ శిక్షణ ఇక్కడ అందుబాటులో ఉంటుంది. ఐటీఈకి ఐదు వేల పరిశ్రమలతో భాగస్వామ్యం ఉంది.

**అక్కడి పాఠ్యాంశాలు తెలంగాణలో..** పరిశ్రమలు తమకు అవసరమైన మానవ వనరులకు ఐటీఈలో నేరుగా శిక్షణనిచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాయి. అదే స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్రంలో ఏర్పాటైన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ తన శిక్షకులకు ఐటీఈతో ట్రెయినింగ్ (ట్రెయినింగ్ ఫర్ ట్రెయినర్స్) ఇప్పించేలా ఒప్పందరం కుదుర్చుకుంది. తాజా ఎంఓయూతో సింగపూర్ ఐటీఈ పాఠ్యాంశాలను మనం ఉపయోగించుకునే వీలు కలుగుతుంది. ఈ ఒప్పంద కార్యక్రమంలో ఐటీఈ సింగపూర్ అకడమిక్, అడ్మిన్ సర్వీసెస్ డిప్యూటీ డైరెక్టర్ పర్విందర్ సింగ్ , ఐటీఈ ఎడ్యుకేషన్ సర్వీసెస్ డిప్యూటీ డైరెక్టర్ ఫాబియన్ చియాంగ్ తో పాటు ఇతర అధికారులు పాల్గొన్నారు. తెలంగాణ ప్రభుత్వ ఆహ్వానం మేరకు సింగపూర్ ఐటీఈ ప్రతినిధి బృందం త్వరలోనే హైదరాబాద్‌లో పర్యటించనుంది.

**సింగపూర్‌తో ఒప్పందం చేసుకున్న తెలంగాణ**
**పలు అంశాలపై సీఎం రేవంత్ బృందం చర్చలు**
**సింగపూర్‌లో టెక్నికల్ వర్సిటీ సందర్శన**
**నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణకు సన్నాహాలు**
**యూనివర్సిటీతో ఒప్పంద పత్రంపై సంతకాలు**
**ఆ దేశ విదేశాంగ మంత్రితోనూ రేవంత్ బృందం భేటీ**
**విస్తృత సహకారం, దీర్ఘకాలిక భాగస్వామ్యంపై సహకారం**
**సీఎం రేవంత్ విజ్ఞప్తికి అంగీకరించిన సింగపూర్ మంత్రి**

**సింగపూర్ విదేశాంగ మంత్రితో సీఎం రేవంత్ భేటీ..** అంతకు ముందు సీఎం రేవంత్, మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఉన్నతాధికారులతో కూడిన బృందం సింగపూర్ విదేశాంగ మంత్రి వివియాన్ బాలకృష్ణన్‌తో విస్తృత చర్చలు జరిపింది. మౌలిక సదుపాయాల అభివృద్ధి, ఇంధనం, స్థిరమైన హరిత ఇంధనం, నీటి నిర్వహణ, నదుల పునరుజ్జీవనం, పర్యాటకం, విద్య, నైపుణ్యాల అభివృద్ధి, ఐటీ పార్కులు తదితర అంశాల్లో విస్తృత సహకారం, దీర్ఘకాలిక భాగస్వామ్యాలను అందివ్వాలని రేవంత్ బృందం కోరింది.. దీనికి సింగపూర్ విదేశాంగ మంత్రి సానుకూలంగా స్పందించారు.

# సంపాదకీయం

ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

## దావోస్ టూర్ లో పవన్ ఎందుకు లేరు ?

ఏపీలో టీడీపీ కూటమి అధికారం లోకి వచ్చిన తరువాత తొలిసారి ఒక అంతర్జాతీయ వేదిక మీద జరిగే అతి పెద్ద సమావేశానికి ముఖ్యమంత్రి హోదాలో చంద్రబాబు అటెండ్ అవుతున్నారు. ఆయనతో పాటు ఇద్దరు మంత్రులు వెళున్నారు. వారిలో ఒకరు నారా లోకేష్ అయితే మరొకరు టీజీ భరత్. ఇక సీనియర్ అఫీషియల్స్ కూడా బాబు బృందంలో ఉన్నారు. ఈ నెల 20 నుంచి 24 వరకు స్విట్జర్లాండ్ వేదికగా వరల్డ్ ఎకనామిక్ ఫోరం నిర్వహిస్తున్నారు. దాని కోసం చంద్రబాబు లోకేష్ ఈ నెల 19న ఏపీ నుంచి దావోస్ కి బయలుదేరి వెళ్తున్నారు. ఇదిలా ఉంటే దావోస్ సదస్సుకు ఉప ముఖ్యమంత్రిగా ఉన్న పవన్ ఎందుకు వెళ్ళడం లేదు అన్న ప్రశ్న ఎదురవుతోంది. దానిని సామాజిక మాధ్యమాల ద్వారా వివిధ రకాలుగా ప్రచారం చేస్తున్న వారూ ఉన్నారు. పవన్ ని కాకుండా లోకేష్ ని తీసుకుని వెళ్తున్నారని ఒక విధంగా నంబర్ టూ గా ఇంటర్నేషనల్ వేదిక మీద లోకేష్ ని ఫోకస్ చేసేందుకే ఇదంతా అని ప్రచారం చేసే వారూ చేస్తున్నారు. మరో వైపు కూటమిలో టీడీపీకి జనసేనకు మధ్య గ్యాప్ ఉందని అందుకే ఇలా చేస్తున్నారు అని అంటున్న వారూ ఉన్నారు. ఇంతకీ మ్యాటర్ ఏంటి అంటే అలాంటిది ఏదీ లేదనేదే. పవన్ చూస్తున్న శాఖలు పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ. అందువల్ల ఆయన దావోస్ లో జరిగే టూర్ కి ఆయన శాఖాపరంగా పెద్దగా పెట్టుబడుల కోసం వెళ్లాల్సింది ఉండదని అంటున్నారు. ఇక ఉప ముఖ్యమంత్రిని తీసుకుని వెళ్లాలి కదా అన్న పాయింటే వస్తే తెలంగాణా లోనూ మల్లు భట్టి విక్రమార్కను అక్కడి సీఎం రేవంత్ రెడ్డి తీసుకుని వెళ్లడం లేదు అని గుర్తు చేస్తున్నారు. అక్కడ రేవంత్ రెడ్డి ఐటీ మంత్రి శ్రీధర్ బాబుని తీసుకుని వెళున్నారు. ఆ విధంగానే ఏపీలో కూడా ఐటీ మంత్రి అయిన నారా లోకేష్ ని అలాగే పరిశ్రమల మంత్రి టీజీ భరత్ ని వెంట బెట్టుకుని వెళ్తున్నారు అని అంటున్నారు విషయం ఇంత క్లారిటీగా ఉంటే బాబు పవన్ ల మధ్య గ్యాప్ అని అందుకే దావోస్ కి పవన్ ని తీసుకుని వెళ్లడం లేదని రాసే వారు రాస్తున్నారు. ప్రచారం చేసే వారు చేస్తున్నారు అని అంటున్నారు. ఇంకా చెప్పాలంటే ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ని కూడా దావోస్ టూర్ కి దూరంగా ఉంచారు. ఆర్థిక మంత్రి హోదాలో ఆయన ఎంతో కొంత రిలవెంట్ అని కూడా చెబుతున్నారు. ఏది ఏమైనా పవన్ కళ్యాణ్ దావోస్ టూర్ వెళ్లకపోవడానికి కారణం ఏదీ ప్రత్యేకంగా లేదని అక్కడ పెట్టుబడులను ఆకర్షించేందుకు అవసరమైన మంత్రులతోనే బాబు ఈ టూర్ చేస్తున్నారు అని చెబుతున్నారు. మొత్తానికి పవన్ లేకుండా బాబు తొలి విదేశీ టూర్ చేస్తున్నారని పక్కన లోకేష్ ఉంటున్నారని సాగుతున్న ప్రచారం లో వాస్తవాలు అయితే లేవని ప్రభుత్వ పార్టీ వర్గాల నుంచి వస్తున్న జవాబు. మరి ఈ క్లారిటీ సరిపోతుందా చాలాదా అంటే వేచి చూడాల్సిందే.

# ఇందిరమ్మ ఇళ్ల సర్వే సరిగా చేశారా?



ఆలేరు : ఉమ్మడి నల్గొండ జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల కోసం వచ్చిన దరఖాస్తుల సర్వే దాదాపు తుది దశకు చేరుకుంది. మొత్తం 9.42 లక్షల దరఖాస్తులు రాగా ఇందులో 95 శాతం సర్వే పూర్తయింది. ఈ నేపథ్యంలో సర్వే సక్రమంగా చేశారా? లేదా..? అని ప్రభుత్వం పునపరిశీలన చేయిస్తోంది. సర్వే పూర్తయిన వారి వివరాలను ఎంపీడీవోలు, పురపాలికల కమిషనర్ల లాగిన్లోకి పంపించారు. ఇందులోంచి వారు ఐదు శాతం ఇళ్లను ఎంపిక చేసుకుని సర్వే సక్రమంగా నిర్వహించిందీ లేనిదీ పరిశీలిస్తారు. ఒకవేళ తప్పుగా వివరాలు నమోదు చేస్తే మళ్లీ సర్వే చేయిస్తారు.


**తప్పుల సవరణకు అవకాశం**

గ్రామాలు, పట్టణాల్లో నెలన్నర రోజులుగా ఇందిరమ్మ దరఖాస్తుల సర్వే కొనసాగుతోంది. ఆయా దరఖాస్తుదారుల వివరాలను పంచాయతీ కార్యదర్శుల లాగిన్‌లో అందుబాటులో ఉంచారు. సర్వే చేసిన సమయంలో దరఖాస్తుదారులు నివసిస్తున్న గృహాల ఫొటోలను యాప్‌లో అప్‌లోడ్ చేశారు. వారి వివరాలను పొందుపరిచారు. ఈ క్రమంలో ఏవైనా తప్పులు దొర్లితే వాటిని సరిచేసే అవకాశం పంచాయతీ కార్యదర్శులకు ఉండేది కాదు. కానీ ఈ నెల 10 నుంచి సవరణకు అవకాశం వచ్చింది. వివరాలు తప్పుగా నమోదైతే వాటిని ఎంపీడీవోల లాగిన్‌లో గుర్తించి తిరిగి పంచాయతీ కార్యదర్శి లాగిన్‌లోకి పంపిస్తారు. అప్పుడు కార్యదర్శి తిరిగి సరి చేయాల్సి ఉంటుంది.

**అర్హులకే ప్రాధాన్యం**

రాష్ట్ర ప్రభుత్వం తొలి విడతలో ఒక్కో నియోజకవర్గానికి 3,500 ఇళ్లను మంజూరు చేసింది. ఒక్కో ఇంటి నిర్మాణానికి రూ.5లక్షల నిధులు ఇస్తామని ప్రకటించింది. దరఖాస్తులు 9,42,870 రావడంతో అర్హులకే తొలి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. సొంతింటి స్థలం ఉన్నవారికి, పూరిళ్లలో నివాసం ఉంటున్న వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. సంక్రాతి తర్వాత గ్రామసభలు ఏర్పాటు చేసి అందులో ఇందిరమ్మ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో లబ్ధిదారులను ఎంపిక చేస్తారు.

# ఖాకీలకు మరకలు



సూర్యాపేట : మఠంపల్లి ఎస్సై రామాంజనేయులును ఐజీ సత్యనారాయణ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కోదాడకు చెందిన ఒక ఎన్ఆర్ఐ కారును రెండు రోజులు వాడుకొని ఇస్తానని చెప్పి నెలలు గడుస్తున్నా.. తిరిగి ఇవ్వకపోవడంతో ఈ మేరకు బాధితులు పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేసిన అధికారులు రామాంజనేయులును విధుల నుంచి తొలగించారు.

సూర్యాపేట పట్టణంలోని విధులు నిర్వహిస్తున్న ముగ్గురు కానిస్టేబుళు బాలకృష్ణ, రాంబాబు, పూర్ణచందర్‌ను ఎస్పీ సన్‌ప్రీత్ సింగ్ మూడు నెలల క్రితం సస్పెండ్ చేశారు. ఇసుక అక్రమ రవాణాకు సహకరిస్తుండటంతో పాటు వారి నుంచి అక్రమ వసూళ్లు చేపట్టినట్లు ఆరోపణలు రావడంతో ఈ చర్య తీసుకున్నారు.

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఏఆర్ విభాగంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న నరేశ్ స్థానికంగా ఓ వివాహితతో కలిసి ఉన్న వీడియో కొద్ది రోజుల క్రితం వైరల్‌గా మారింది. మహిళ భర్త పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేసిన అధికారులు నరేశ్‌ను సస్పెండ్ చేశారు. పెన్‌పహాడ్ పోలీసు స్టేషన్ పరిధిలో రూ.15 వందల మామూళ్ల పంపిణీలో కానిస్టేబుల్, హోంగార్డు ఘర్షణకు దిగడం సంచలనంగా మారింది. పదిహేను రోజుల క్రితం జరిగిన ఈ ఘటనతో కానిస్టేబుల్ జాటోత్ రవికుమార్, హోంగార్డు గంజి శ్రీనును విధుల నుంచి తొలగిస్తూ ఎస్పీ ఉత్తర్వులు జారీ చేశారు.

సూర్యాపేట జిల్లా పోలీసులు ఇటీవల తీవ్ర వివాదాస్పదంగా మారుతున్నారు. సాధారణంగా ఎవరికి ఎలాంటి కష్టం ఎదురైనా వెంటనే పోలీసులే గుర్తుకు వస్తారు. అలాంటి పోలీసులే తప్పటడుగులు వేస్తూ అడ్డంగా దొరికిపోతున్నారు. తప్పులను సరి దిద్దాల్సిన వారే తప్పులు చేస్తూ సస్పెన్షన్లకు గురికావడం గమనార్హం. కొంత మంది చేసిన తప్పులకు పోలీసు శాఖ మొత్తానికి తలవంపులు ఎదురవుతున్నాయి. ఈ శాఖలో ఎంతో మంది నిబద్ధత, చిత్తశుద్ధితో కర్తవ్యం నిర్వహిస్తున్న వారు ఉన్నారు. మరికొందరు మాత్రం లంచం తీసుకోవడం, వివాహేతర సంబంధాలు ఏర్పర్చుకోవడం, ఠాణాకు వచ్చే వారి పట్ల అనుచితంగా ప్రవర్తించడం లాంటి చర్యలకు పాల్పడుతూ స్నేహపూర్వక పోలీసింగ్‌కు తూట్లు పొడుస్తున్నారు.

**జనం అసంతృప్తి**

నూతనకల్‌లో కొత్త సంవత్సర వేడుకల సందర్భంగా ఇంటి ఎదుట కూర్చొని మద్యం తాగుతున్న వ్యక్తిని పోలీసులు చితకబాదిన ఘటన సంచలనంగా మారింది. పోలీసుల దెబ్బలకు బాధితుడి ఒంటిపై తీవ్ర గాయాలైన చిత్రాలు సామాజిక మాధ్యమంలో వైరల్‌గా మారాయి. తప్పు చేసిన వ్యక్తిపై చట్టప్రకారం కేసు నమోదు చేయాల్సిన పోలీసులు లాఠీలకు పనిచెప్పడం పలు విమర్శలకు దారితీసింది. ఠాణాకు వచ్చే ఫిర్యాదుదారులు చేతి ఖర్చులకు డబ్బులు ఇస్తేనే నిందితులను పిలిపిస్తామంటూ సూర్యాపేటలో ఇద్దరు హెడ్ కానిస్టేబుల్‌లు వేదిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. జిల్లాలోని మరికొన్ని ఠాణాల్లోనూ ఇదే పరిస్థితులు ఉన్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

**తప్పు చేసిన వారిపై చర్యలు తప్పవు**

రవి, డీఎస్పీ, సూర్యాపేట

తప్పు చేసినవారు ఎవరైనా చర్యలు తప్పవు. పోలీసు శాఖ అంటేనే క్రమశిక్షణకు మారుపేరు. అలాంటి శాఖలో పనిచేస్తూ తలవంపులు చేసే పనులు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. అదే సమయంలో మంచి పనులు చేసే వారినీ గుర్తించి తగిన విధంగా ప్రోత్సహిస్తాం. ఎవరో ఒక్కరు, ఇద్దరు చేసిన పనులకు పోలీసు శాఖ మొత్తాన్ని నిందించడం సరికాదు.

# సౌరకాంతులు.. అతివలకు ఆదాయ మార్గాలు..!



కొత్తగూడెం : సౌరకాంతులను ఆదాయ మార్గాలుగా మలిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. థర్మల్ విద్యుత్తు వల్ల వెలువడే కర్బన ఉద్గారాలను తగ్గిస్తూ.. పర్యావరణ హితమైన సౌరశక్తి ద్వారా గృహ, వ్యవసాయ అవసరాలకు నాణ్యమైన విద్యుత్తు అందించేందుకు చర్యలు తీసుకుంటోంది. కేంద్ర ప్రభుత్వ పథకాలు 'పీఎం సూర్యఘర్', 'పీఎం కుసుమ్' వంటి వాటిని ఉపయోగించుకుని రాష్ట్రంలో సౌర విద్యుదుత్పత్తిని పెంచే దిశగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా రైతులు, మహిళా సంఘాల ఆధ్వర్యంలో ప్లాంట్ల ఏర్పాటుకు సమాయత్తమవుతోంది. 'పీఎం కుసుమ్' కింద రాష్ట్రవ్యాప్తంగా ఏర్పాటుచేసే 4వేల మెగావాట్ల సోలార్ ప్యానెళ్లలో వెయ్యి మెగావాట్లను మహిళా సంఘాలకు అప్పగించాలని నిర్ణయించింది.

**60 మెగావాట్ల సోలార్ విద్యుత్తు..**

ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో 60 మెగావాట్ల సోలార్ ప్యానెళ్ల ఏర్పాటుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఒక్కో జిల్లాలో 150 ఎకరాల భూమిని సేకరించి మహిళా సంఘాలకు అప్పగించనున్నారు. ఒక్కో మెగావాట్‌కు గరిష్ఠంగా ఐదెకరాల భూమి అవసరమవుతుంది. ఈ లెక్కన 300 ఎకరాల్లో 60 మెగావాట్ల సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు చేయడానికి అవకాశం ఉంటుంది. జిల్లాల వారీగా ప్రభుత్వ స్థలాలు ఎక్కడెక్కడున్నాయో అధికారులు ఆరాతీస్తున్నారు. ఖమ్మం జిల్లాలో ఇప్పటికే 24 ఎకరాల భూమిని గుర్తించారు. భద్రాద్రిలో అనువైన స్థలాల గుర్తింపు ప్రక్రియ మొదలుకావాల్సి ఉంది. రైతులెవరైనా తమ పంట పొలాలను లీజుకు ఇవ్వదలుచుకుంటే వారి నుంచి భూములు తీసుకుని మహిళా సంఘాలకు కేటాయిస్తారు. అయితే రైతులకు లీజు ఎంత చెల్లించాలనేది నిర్ణయించాల్సి ఉంది. లీజు మొత్తాన్ని మహిళా సంఘాలే చెల్లించాలి.

**పదేళ్ల పాటు రాబడి..!**

సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు ఆసక్తి కలిగిన మహిళా సంఘాలకు భూములను 25ఏళ్ల కాలపరిమితితో ప్రభుత్వం కేటాయిస్తుంది. ఒక మెగావాట్ ప్లాంటు ఏర్పాటుకు సుమారు రూ.4–5 కోట్లు వెచ్చించాల్సి వస్తుంది. ఇందులో ఎస్‌హెచ్‌జీలు 10శాతం చెల్లిస్తే మిగతా మొత్తం.. బ్యాంకుల ద్వారా రుణం అందుతుంది. 15ఏళ్లలో ప్లాంటు నిర్మాణ ఖర్చులు తిరిగి రానుండగా.. మరో పదేళ్లపాటు విద్యుదుత్పత్తితో సంఘాలకు ఆదాయం సమకూరుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

మహిళా సంఘాల ద్వారా సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం భూములను గుర్తించే ప్రక్రియ చేపడుతోంది. ఉభయ జిల్లాల్లో 300 ఎకరాల్లో పాంట్లు ఏర్పాటు చేయనున్నాం. టెండర్ ప్రక్రియ పూర్తయితే ప్లాంట్ల ఏర్పాటుకు అవకాశముంటుంది. అజయ్‌కుమార్, ఉభయ జిల్లాల మేనేజర్, టీజీ రెడ్కో

# ఏటీఎంలకు రక్షణేదీ?

కామారెడ్డి : ఉమ్మడి జిల్లాలో చోరులు రెచ్చిపోతున్నారు. ఏకంగా ఏటీఎంలలో దొంగతనాలకు పాల్పడుతున్నారు. తాజాగా పిట్లం మండలంలో చోటుచేసుకున్న ఘటన కలకలం సృష్టించింది. అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టాల్సిన అవసరాన్ని తాజా ఉదంతం చాటుతోంది.

**వ్యవస్థ లోపంతోనే..** వ్యవస్థ లోపంతోనే వరుస ఏటీఎం చోరీలు జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. నేరుగా పోలీసులను అప్రమత్తం చేసే అలారం వ్యవస్థ లేకపోవడం, పోలీసులకు సమాచారం చేరవేయడంలో బ్యాంకు అధికారులు సమయం వృథా చేస్తున్నారు. సెక్యూరిటీ గార్డులను నియమించకపోవడం, పెట్రోలింగ్ లేమి, ఏటీఎంల



సమీపంలో సీసీ కెమెరాలు, పర్యవేక్షణ లేకపోవడం తదితర అంశాలు వ్యవస్థ లోపాలను తేటతెల్లం చేస్తున్నాయి.

**బాధ్యత ఎవరిది..**

ఏటీఎంల రక్షణ బాధ్యతను కేవలం సాంకేతికతకే వదిలేస్తున్నారు. వాటిని కాపాడే పనిని ఎవరికో ఒక్కరికి అప్పగించాల్సిన ఆవశ్యకతను గుర్తించాలి. దీనికోసం పోలీసులను వినియోగిస్తే మేలంటున్నారు. లేదంటే కనీసం బ్యాంకు అధికారులైన సెక్యూరిటీ గార్డులను నియమించాలనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతుంది.

**తాజా ఘటనలు**

కామారెడ్డి జిల్లాలో.. ఇటీవల బిచ్కుంద మండల కేంద్రంలోని ఎస్‌బీఐ ఏటీఎంను నలుగురు దుండగులు గ్యాస్ కట్టర్‌తో తొలగించి డబ్బాతో సహా ఎత్తుకెళ్లారు. చోరీకి వినియోగించిన వాహనాన్ని ఒక్కరోజు ముందే నిజామాబాద్ జిల్లా రెంజల్‌లో చోరీ చేసి తెచ్చారు. ఏటీఎం డబ్బాను పగులగొట్టి రూ.3లక్షల నగదు దొంగిలించుకెళ్లారు.

భిక్కనూరు మండలంలోని జంగంపల్లిలోని ప్రస్తుత యూనియన్ బ్యాంకు ఏటీఎంలో చోరీకి విఫలయత్నం చేశారు. జిల్లా కేంద్రంలోని మరో రెండు చోట్ల సైతం ఏటీఎం చోరీలకు విఫలయత్నం జరిగింది.

తాజాగా పిట్లం మండల కేంద్రంలోని ఏటీఎంను దుండగులు గ్యాస్ కట్టర్‌తో తొలగించి రూ.17,79,100 నగదును దోచుకెళ్లారని పోలీసులు చెబుతున్నారు.

**నిజామాబాద్ జిల్లాలో..** రుద్రూర్ మండల కేంద్రంలోని బస్టాండ్ ప్రధాన రోడ్డు పక్కనే ఉన్న ఎస్‌బీఐ ఏటీఎం పగులగొట్టి రూ.25 లక్షలను దుండగులు ఎత్తుకెళ్లారు. జిల్లాకేంద్రంలో ఏటీఎం చోరీకి ప్రయత్నించగా అలారం మోగడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అంతలోనే దుండగులు అక్కడి నుంచి పరారయ్యారు. జిల్లా కేంద్రంలోని గోశాల రోడ్డులోని ఎస్‌బీఐ ఏటీఎంను, అర్సపల్లిలో, నవీపేటలో ఏటీఎంలను ధ్వంసం చేసి నగదును దోచుకెళ్లే ప్రయత్నం చేయగా అలారాలు మోగడంతో దొంగలు అక్కడి నుంచి ఉడాయించారు.

# నేతలు చెప్పిన చోటే సర్వే

నిజామాబాద్:: జిల్లాలో రెవెన్యూ యంత్రాంగం పనితీరు విమర్శలకు తావిస్తోంది. ముఖ్యంగా భూముల సర్వే విషయంలో ఇది కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఆక్రమణలు, కబ్జాలపై వస్తున్న ఫిర్యాదులపై స్పందించే తీరు ఇందుకు కారణమవుతోంది. రాజకీయ పలుకుబడి ఉన్నవారు చెప్పిన విషయాలకు ప్రాధాన్యం ఇవ్వటంలో చూపే శ్రద్ధ.. మిగతా సందర్భాల్లో ఉండటం లేదు. జిల్లాలో పలు సంఘటనల్లో చోటుచేసుకున్న విషయాలు ఇందుకు నిదర్శనం. ఉన్నతాధికారులకు తెలిసినా.. పరిస్థితిలో మార్పు కనిపించకపోవటం సామాన్యులకు బాధ కలిగిస్తోంది. మాక్లూర్ మండలంలో గ్రామ అవసరాలకు కేటాయించిన భూమి ప్రైవేటు వ్యక్తుల భూమిలో కలిసిందని ఇటీవల అధికారులకు ఫిర్యాదు అందింది. సాధారణంగా ఈ వివాదంలో రెవెన్యూ వారు స్పందించి చర్య తీసుకోవాలంటే నెలలు గడిచేవి. కానీ ఒక నెలలోనే నాలుగుసార్లు ఉద్యోగులు మోకా మీదకు వెళ్లారు. సర్వే చేసి మ్యాప్‌ల ఆధారంగా హద్దుల నిర్ధారణ చేసి నివేదిక సిద్ధం చేశారు. ఇంత వేగంగా స్పందించడం ఆశ్చర్యానికి గురిచేసింది. కారణం ఏంటని ఆరాతీస్తే అసలు విషయం తెలిసింది. అధికార పార్టీకి చెందిన ఓ నేత చెప్పటంతో అధికారులు ఇంత వేగంగా కదిలారు.

నిజామాబాద్ గ్రామీణ మండలంలోని ఓ గ్రామంలో ఇటీవల భూవివాదం తెరపైకి వచ్చింది. ఇది ఇద్దరి వ్యక్తుల ఆస్తి తగాదాతో ముడిపడి ఉంది. ఇందులో ఒకవర్గం వారు ఓ రాజకీయ పార్టీ నాయకుడిని కలిశారు. తమకు అన్యాయం జరిగిందని.. అవతలి వ్యక్తులు ఇతర పార్టీకి చెందిన వారు అని చెప్పారు. దీంతో సదరు నాయకుడు వారికి సహాయం చేయటానికి ఆసక్తి చూపించారు. ఇంకేముంది రెవెన్యూ యంత్రాంగం వెంటనే రంగంలోకి దిగి ఆగమేఘాల మీద సర్వే చేపట్టింది. బోధన్ శివారులోని ఓ ప్రాంతంలో భూమి లెక్కలు తేల్చేందుకు రెవెన్యూ అధికారులు ఇటీవల ఆగమేఘాల మీద సర్వే చేశారు. ఎందుకు చేస్తున్నది కూడా బయటకు చెప్పలేదు. దీంతో చుట్టుపక్కల రైతులు ఆందోళన చెందారు. ఒకచోట అయితే ఓ రైతు పొలంలోకి వచ్చి కొలతలు వేయడంతో ఆయన భయపడ్డారు. ఇది కూడా ఓ పెద్దాయన చెప్పడంతో చేశారని తర్వాత తెలిసింది.

**ప్రాధాన్యం మరిచి.. పనులు**

నేతలు చెప్పిన విషయాలకు స్పందించొద్దని కాదు.. ఇతర సమస్యలకూ ప్రాధాన్యం ఇవ్వాలి. జిల్లాలో దేవాదాయశాఖ భూములు ఆక్రమణకు గురయ్యాయి. బడారాంమఠ్ భూములను ప్రైవేటు వ్యక్తులు కబ్జా చేశారు. వీటిని దేవాదాయశాఖ రికార్డుల ఆధారంగా క్షేత్రస్థాయిలో గుర్తించి హద్దులు నిర్ణయించాల్సి ఉంది. ఇందుకోసం సర్వే విభాగం సహాయం కోసం దేవాదాయశాఖ పలుమార్లు విన్నవించింది. కానీ రెవెన్యూ విభాగం నుంచి ఆశించిన స్పందన లేదు. ఎన్నిసార్లు చెప్పినా రెవెన్యూ అధికారులు కదలటం లేదు. ఏడాది కాలంగా ఈ సమస్య దేవాదాయ, రెవెన్యూ శాఖల మధ్య నలుగుతోంది. విమర్శలకు తావిస్తున్న ఈ పరిస్థితిలో మార్పు రావాలని జిల్లా ప్రజలు కోరుకుంటున్నారు.

# డిగ్రీ విద్యార్థులకు ఇంజినీరింగ్ అంశాలు

హైదరాబాద్: బీఏ, బీకాం, బీఎస్సీ పూర్తి చేసిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు లభించేలా వర్సిటీలు వినూత్న పంథా అనుసరించనున్నాయి. ఉపాధి కల్పన, ప్రాంగణ నియామకాలు కల్పించేలా డిగ్రీ కోర్సుల్లో ఇంజినీరింగ్ సబ్జెక్టులను ప్రవేశపెట్టనున్నాయి. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యాసంస్థల తరహాలో పాఠ్యాంశాలను రూపొందించనున్నారు. ఉస్మానియా అధికారులు ఉన్నతవిద్యా మండలి, అఖిల భారత సాంకేతిక విద్యామండలి ఆమోదంతో ఇంజినీరింగ్ పాఠ్యాంశాలను అందుబాటులోకి తీసుకురానున్నారు. ఐఐటీల్లోనూ బ్యాచిలర్ ఆఫ్ సైన్స్.. విశ్వవిద్యాలయాలు, డిగ్రీ కళాశాలల్లో పదేళ్ల నుంచి బీఎస్సీ చదువుకుంటున్న విద్యార్థులకు ఐటీ, ఫార్మా, ఇంజినీరింగ్ రంగాల్లో ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయి. పరిశోధన సంస్థల్లో జూనియర్ స్థాయి శాస్త్రవేత్తలుగా, పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. ఈ అంశాలను గమనించిన ఐఐటీలు తమ దృక్పథాన్ని మార్చుకున్నాయి. రెండు, మూడేళ్ల నుంచి బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ పేరుతో నాలుగేళ్ల డిగ్రీ కోర్సు ప్రవేశపెట్టాయి. ఐఐటీ బాంబేలో బ్యాచిలర్ ఆఫ్ సైన్స్‌లో భౌతిక, రసాయన, గణిత శాస్త్రాల కోర్సులు అందుబాటులోకి తెచ్చారు. జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌లో సాధించిన ర్యాంకుల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తోంది. ఐఐటీ మద్రాస్‌లో నాలుగేళ్ల బ్యాచిలర్ ఆఫ్ సైన్స్ (డేటా సైన్స్)ను



అందుబాటులోకి తీసుకొచ్చింది. డేటా సైన్స్ కోర్సుల్లో ఏఐ అంశాలు ఉండాలి? మూల్యాంకనం ఎలా ఉండాలి? అన్న విషయాలపై ఐఐటీ మద్రాస్ అధికారులు పలు పరిశ్రమల ప్రతినిధులతో చర్చించి, పాఠ్యాంశాలు రూపొందించారు.

కృత్రిమ మేధ.. డేటా సైన్స్..సైబర్ భద్రత.. వర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాలల్లో బీఏ, బీకాం, బీఎస్సీ విభాగాల్లో ప్రథమ సంవత్సరం నుంచే కృత్రిమ మేధ, డేటా సైన్స్, సైబర్ భద్రత సబ్జెక్టులను ప్రవేశపెట్టాలని ఉస్మానియా విశ్వవిద్యాలయ అధికారులు ప్రాథమికంగా నిర్ణయించారు. బీఏ, బీకాం విద్యార్థులకు కృత్రిమ మేధ, డేటా సైన్స్‌పై అవగాహన కలిగేలా పాఠ్యాంశాలు రూపొందించనున్నారు. బీకాం విద్యార్థులకు కృత్రిమ మేధ ద్వారా అకౌంటింగ్, టాలీలను సులువుగా నేర్చుకునేందుకు ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహించనున్నారు. వినోద, పర్యాటక, హాస్పిటాలిటీ రంగాల్లో ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించేలా సిలబస్ తీర్చిదిద్దనున్నారు.

# అదిగో.. ఇదిగో!


సుభాష్‌నగర్: జిల్లాలో సమగ్ర, సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ కులగణన సర్వే చేపట్టారు. ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావించి ప్రత్యేక పర్యవేక్షణతో ఈ సర్వే కొనసాగించారు. ఇంటింటికి తిరుగుతూ స్టిక్కర్లు అందించి వివరాలు నమోదు చేశారు. పంచాయతీలు, మున్సిపాలిటీల పరిధిలో సుమారు 45 రోజులపాటు సర్వే చేయగా అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగులు, అధికారులు భాగస్వాములయ్యారు. సమగ్ర సర్వేలో విధులు నిర్వర్తించిన ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్లకు పారితోషికం ఇస్తామని చెప్పి వదిలేశారు. అదిగో, ఇదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు. కనీసం పండుగ అవసరాలకైనా తోడ అవుతాయని చిరు ఉద్యోగులు ఎదురు చూసినా ఫలితం లేకుండా పోయింది.

**సర్వే చేసింది వీరే..**

గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు, పాఠశాల ఉపాధ్యాయులు, పురపాలికల్లో మున్సిపల్ ఉద్యోగులు, ప్రభుత్వ శాఖల్లో పని చేసే వారు, ఉపాధ్యాయులు, మెప్మా రిసోర్స్ పర్సన్లు, సీవోలు, ఇతర సిబ్బంది హాజరై ఇంటింటా తిరుగుతూ వివరాలను నమోదు చేశారు. ఆ తర్వాత కార్యాలయాల్లో వాటిని ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేశారు.

**నిధులొచ్చినా..**

ప్రభుత్వం సర్వే ఏర్పాట్లు చేసేందుకు, సిబ్బంది కోసం జిల్లాకు



రూ.2.37 కోట్లు మంజూరు చేసింది. సర్వే నిర్వహించిన ఎన్యుమరేటర్‌కు రూ.10 వేలు, సూపర్‌వైజర్‌కు రూ.12 వేల చొప్పున, ఆపరేటర్లకు పారితోషికాలు మొత్తాన్ని చెల్లించాల్సి ఉంది. సర్వే పూర్తయిన తర్వాత ఎంపీడీవోలు, కమిషనర్లు బ్యాంకు ఖాతాలు తీసుకున్నారు. కలెక్టరేట్ నగరపాలికలో సైతం కొద్ది రోజుల కిందట బ్యాంకు ఖాతాలు తీసుకోగా ఇప్పటి వరకు చెల్లింపులు చేయలేదని, అసలు ఇస్తారా లేదా? అనేది కూడా చెప్పడం లేదని ఉద్యోగులు వాపోతున్నారు. సర్వేకు అయితే పరుగులు పెట్టిస్తున్న అధికారులు కనీసం ఉద్యోగుల తరఫున పారితోషికాలు ఇప్పించాలనే ఆలోచన మాత్రం చేయడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

జిల్లాలో వివరాలు

| | |
|---|---|
| మున్సిపాలిటీల వార్డులు: | 146 |
| పంచాయతీ వార్డులు : | 313 |
| ఎన్యుమరేటర్లు : | 2,864 |
| సూపర్‌వైజర్లు : | 287 |
| ప్రత్యేక అధికారులు : | 20 |

**త్వరలోనే ఖాతాల్లో జమ**

సర్వే చేసిన సిబ్బందికి పారితోషికం అందించేందుకు చర్యలు చేపట్టాం. త్వరలోనే వారి ఖాతాల్లో జమ అవుతాయి. ఎంపీడీవోలు, కమిషనర్లకు నిధులు విడుదల చేశాం. నెలవారీ జీతాల చెల్లింపు తరహాలోనే ఈ మొత్తం ఖాతాల్లో చేరుతోంది. ప్రఫుల్ దేశాయ్, అదనపు కలెక్టర్

# అధ్యయనం చేయాలి.. అడ్డుకట్ట వేయాలి



హైదరాబాద్ : రోడ్డు ప్రమాదాల నియంత్రణ, ప్రాణ నష్టాన్ని తగ్గించేందుకు రాచకొండ పోలీసులు సరికొత్త ప్రణాళికతో ముందుకెళుతున్నారు. కమిషనరేట్ పరిధిలో ఎక్కడైనా పెద్ద రోడ్డు ప్రమాదం జరిగితే.. క్షతగాత్రులకు సత్వర వైద్యం అందించడంతోనే సరిపెట్టకుండా.. అలాంటి ప్రమాదాలు భవిష్యత్తులో జరగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. ఇందుకు ఏఏపీటీ(ప్రమాద విశ్లేషణ, నియంత్రణ విభాగం)ను ఏర్పాటుచేశారు. రాచకొండలో ఏటా మూడు వేలకుపైగా రోడ్డు ప్రమాదాలు, 700 దాకా మరణాలు నమోదవుతున్నాయి. ఏఏపీటీ చర్యలతో రోడ్డు ప్రమాదాలు తగ్గుతున్నట్లు అధికారులు చెబుతున్నారు.

**ఏఏపీటీ ఎలా పనిచేస్తుందంటే..?**

కమిషనరేట్ పరిధిలో ఏదైనా ప్రాంతంలో రోడ్డు ప్రమాదం జరిగి మరణాలు నమోదవ్వడం, ఎక్కువ మంది క్షతగాత్రులైనప్పుడు ఏఏపీటీ రంగంలోకి దిగుతుంది. దీనికి ఏసీపీ స్థాయి అధికారి నేతృత్వం వహిస్తారు. ఈ బృందం ఘటనా స్థలికి వెళ్లి పరిశీలిస్తుంది. ప్రమాదం జరగడానికి కారణం రోడ్డు ఇంజినీరింగ్ లోపమా.. ఆ ప్రాంతంలో అనూహ్య మలుపులు ఉన్నాయా.. స్తంభాలు అడ్డుగా ఉన్నాయా..? ఇలా అన్ని రకాలుగా విశ్లేషించి లోపం ఎక్కడుందో గుర్తిస్తుంది. తర్వాత సమస్యను పరిష్కరించే సంబంధిత శాఖకు నివేదిస్తుంది. ప్రమాదం జరిగిన ప్రాంతంలో చేపట్టాల్సిన పనులను సూచిస్తుంది. 2024 డిసెంబరు తొలివారంలో రాచకొండ కమిషనరేట్ పరిధిలోని పోచంపల్లి మండలం జలాల్‌పూర్ చెరువులోకి కారు దూసుకెళ్లి ఐదుగురు యువకులు మృత్యువాతపడ్డారు. ఈ ప్రమాదం జరగడానికి కారణాలపై అధ్యయనం చేసిన రాచకొండ ఏఏపీటీ బృందం.. జలాల్‌పూర్ చెరువు కట్ట వెంట రెయిలింగ్ లేకపోవడం, పెద్ద మలుపును గుర్తించింది. దీన్ని సంబంధిత శాఖకు నివేదించగా రెయిలింగ్, ప్రమాద సూచికల ఏర్పాటుకోసం ప్రభుత్వం రూ.30లక్షలు మంజూరుచేసినట్లు అధికారులు తెలిపారు.

**బ్లాక్‌స్పాట్లను తగ్గించే ప్రయత్నం**

కమిషనరేట్ పరిధిలో 246 కి.మీ.ల జాతీయ రహదారులు, 61 కి.మీ.ల మేర ఔటర్ రింగురోడ్డు, 783.5 కి.మీ.ల అంతర్గత రహదారులున్నాయి. ఏటా ప్రమాదాల సంఖ్య పెరుగుతోంది. దీనికి పరిష్కారాలు చూపేందుకు ఏఏపీటీ పనిచేస్తోంది. ప్రమాదాలు ఎక్కువగా జరిగే 103 బ్లాక్ స్పాట్లను గుర్తించింది. ఆ ప్రాంతాల్లో ప్రమాదాలు పూర్తిగా తగ్గించే దిశగా అధికారులు ప్రయత్నాలు చేస్తున్నారు.

**12.4 శాతం తగ్గించగలిగాం**

రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు ఏఏపీటీని అందుబాటులో తీసుకొచ్చాం. ఎక్కడైనా తీవ్ర రోడ్డు ప్రమాదం జరిగితే ఈ బృందం అక్కడ లోపాలేంటో గుర్తించి పరిష్కారాలు సూచిస్తుంది. ఈ తరహా చర్యలతో తీవ్ర రోడ్డు ప్రమాదాలను 12.41 శాతం తీవ్ర రోడ్డు ప్రమాదాలను తగ్గించగలిగాం. ఔటర్‌పై 36.6 శాతం తగ్గాయి. సుధీర్‌బాబు, రాచకొండ పోలీస్ కమిషనర్

# సైబర్ ఉచ్చులో పల్లె బిడ్డలు!




హైదరాబాద్: చదువులు పూర్తయి ఉపాధి కోసం ఎదురుచూపులు చూస్తున్న యువత.. నిరాశ, నిస్పృహ మధ్య ఏ చిన్న అవకాశం వచ్చినా ఆకర్షితులవుతున్నారు. ఈ బలహీనతనతో సైబర్ ఉచ్చులో చిక్కుతున్నారు. తెలుగు రాష్ట్రాలను లక్ష్యం చేసుకొని సైబర్ ముఠాలు కొత్త ఎత్తులు వేస్తున్నాయి. ఒక వైపు మోసాలతో రూ.కోట్లు కొల్లగొడుతూనే మరోవైపు ఇక్కడి పేద, మధ్యతరగతి కుటుంబాల్లోని యువతను ఉద్యోగం, ఉపాధి పేరిట ఏజెంట్లుగా మలచుకుంటున్నాయి. ఇలా రెండురకాల మోసానికి గుర్రై ఠాణాల చుట్టు తిరుగుతున్నారు. ఇటీవల పెట్టుబడులు మోసాల కేసుల్లో దర్యాప్తు చేపట్టిన పరిశీలిస్తున్న నగర సైబర్‌క్రైమ్ ఇన్‌స్పెక్టర్ మధులత బృందం లింకులను గుర్తించారు. యువత జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తున్న కేటుగాళ్ల చేతుల నుంచి బయటపడేసేందుకు సైబర్‌క్రైమ్ పోలీసులు సిద్ధమయ్యారు. అవగాహన కల్పించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మూసారాంబాగ్‌కు చెందిన యువకుడు బీ ఫార్మసీ పూర్తిచేశాడు. ఉద్యోగ వేట కొనసాగిస్తూ.. ఆటో నడుపుతున్నాడు. ప్రతి నెలా రూ.5వేలు కమీషన్ వస్తుందనే మిత్రుడి సలహాతో బ్యాంకు ఖాతా అతడికిచ్చాడు. దానిలో జరిగే లావాదేవీలను గుర్తించలేకపోయాడు. గుజరాత్‌కు చెందిన ముఠా ఆ ఖాతాను దుర్వినియోగం చేసినట్టు గుర్తించిన సైబర్ పోలీసులు అతడిని నిందితుల జాబితాలో చేర్చారు.

కోదాడ చుట్టుపక్కల కొన్ని గ్రామాల్లో యువతీ, యువకులు సైబర్ మోసగాళ్లకు ఏజెంట్లుగా మారినట్టు నిర్ధారించారు. యువత బ్యాంకు ఖాతాలను ఉపయోగించుకుంటున్నారు. వీరి ద్వారానే ఖాతాల్లోకి చేరిన సొమ్మును క్రిప్టోగా మార్చి తాము సూచించిన విదేశీ ఖాతాల్లో జమ చేయించుకుంటున్నారు.

**ఇప్పుడేం జరుగుతుందంటే**

దుబాయ్, థాయ్‌లాండ్, సింగపూర్, కంబోడియా, చైనా తదితర దేశాల్లో సూత్రదారులు గుజరాత్, రాజస్థాన్, మహారాష్ట్ర, కర్ణాటక, ఏపీ, తెలంగాణల్లో దళారులను నియమించుకుంటున్నారు. వీరికి పెద్దఎత్తున కమీషన్‌లు ఇస్తూ మోసాల చక్రం తిప్పుతున్నారు. సైబర్‌క్రైమ్ పోలీసులు లింకులను ఛేదించే క్రమంలో హైదరాబాద్, నిజామాబాద్, కోదాడ ప్రాంతాలకు చెందిన గ్రామీణ యువతను మాయగాళ్లు లక్ష్యం చేసుకొని వారి ఖాతాల నుంచి రూ.కోట్లు లావాదేవీలు నిర్వహిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. అగ్రికల్చర్‌లో గ్రాడ్యుయేషన్ పూర్తిచేసిన యువకుడు, మరో విద్యార్థికి ఈ కేసులో నోటీసులు జారీచేశారు.

**బ్యాంకుల తీరుపై ఆర్బీఐకి ఫిర్యాదు**

అడ్డదారిలో ఆదాయానికి ఆశపడితే అపాయంలోకి నెట్టేస్తుందని యువత గుర్తించాలి. ఏ సంస్థ డబ్బు తీసుకొని ఉద్యోగాలివ్వదు. కమీషన్, రాబడి వస్తుందనే భరోసాతో మోసగాళ్లకు సహకరించటం కూడా నేరమే. షెల్‌కంపెనీలకు కరెంట్‌ఎకౌంట్ ఖాతాలను సులువుగా ప్రారంభిస్తున్న బ్యాంకుల తీరుపై రిజర్వ్‌బ్యాంక్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేశాం. లక్ష్యాన్ని పూర్తిచేసేందుకు కొన్ని బ్యాంకులు కేవైసీ మాత్రమే తీసుకుంటున్నాయి.
దార కవిత, డీసీపీ నగర సైబర్‌క్రైమ్

# శుద్ధీకరణకు నీటి కొరత



కోరుట్ల: ఇంటింటికీ శుద్ధజలం అందించేందుకు ప్రవేశపెట్టిన మిషన్ భగీరథ పథకం పూర్తిస్థాయిలో అమలు కావడం లేదు. ఇబ్రహీంపట్నం మండలం డబ్బా వద్ద నీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి జిల్లాలోని కోరుట్ల, మెట్‌పల్లి, జగిత్యాల, ధర్మపురి, రాయికల్ పురపాలికలతోపాటు 15 మండలాల్లోని 346 గ్రామాలకు మిషన్ భగీరథ నీటిని సరఫరా చేయాల్సి ఉంటుంది. కొంతకాలంగా ఎస్సారెస్పీ వద్ద పంపింగ్ మోటార్లు చెడిపోవడంతో నీటి సరఫరా సక్రమంగా కావడం లేదు. ముఖ్యంగా పట్టణ ప్రజలు తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ జలాశయం నుంచి బాల్కొండ మండలం జలాల్‌పూర్ వద్ద నిర్మించిన ఇన్‌టెక్‌వెల్‌లోకి జలాలు చేరుతుండగా.. అక్కడ నుంచి ఆరు మోటార్ల ద్వారా 35 కి.మీ మేర నిర్మించిన పైపులైన్ ద్వారా డబ్బా నీటి శుద్ధి కేంద్రానికి తరలిస్తారు. జిల్లాలో 1.70 లక్షల మంది జనాభాకు నీటిని అందించేందుకు ప్రణాళికలు రూపొందించారు. అందుకోసం సంపులు, ట్యాంకులను నిర్మించి పట్టణాలు, గ్రామాల్లోని అంతర్గత పైపులైన్ల ద్వారా ఇంటింటికీ కుళాయిల ద్వారా భగీరథ నీరు అందించాల్సి ఉంటుంది. జలాల్‌పూర్ వద్ద నిత్యం నాలుగు మోటార్లు నడిపించడం ద్వారా గ్రిడ్‌కు సంవత్సరానికి అవసరమైన 1.25 టీఎంసీల నీరు అందుతుంది. రెండు మోటార్లు చెడిపోయి చాలా రోజులు కావస్తుండగా కేవలం రెండు మోటార్లు మాత్రమే నడుస్తున్నాయి. రెండు మోటార్లను మరమ్మతు కోసం పంపించారు. దీంతో సగం మాత్రమే నీరు పంపింగ్ అవుతుంది. నిత్యం 9 కోట్ల లీటర్ల నీటిని శుద్ధి చేయాల్సి ఉండగా కేవలం సగం వరకు మాత్రమే శుద్ధి చేస్తున్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా విషయమై ఈఈ శేఖర్‌రెడ్డిని సంప్రదించగా ఎస్సారెస్పీ వద్ద నాలుగు మోటార్లకు కేవలం రెండు మోటార్లు మాత్రమే పనిచేస్తున్నాయని వాటి ద్వారా వచ్చే నీటిని గ్రిడ్‌లో శుద్ధి చేసి ప్రజలకు సరఫరా చేస్తున్నామన్నారు. రెండు మోటార్లను మరమ్మతు కోసం పంపించామన్నారు. ఒక మోటారు రెండు రోజుల్లోగా రాగా, మరో మోటారు వారం రోజుల్లోగా వస్తుందని పేర్కొన్నారు. అప్పుడు పూర్తిస్థాయిలో నీటి పంపింగ్ చేపట్టి భగీరథ నీరు అందేలా చూస్తామని వివరించారు.

**వేసవికి ముందే..**

ఎస్సారెస్పీ నుంచి రెండు మోటార్ల ద్వారా మాత్రమే నీటి పంపింగ్ జరుగుతోంది. గ్రిడ్ నుంచి నీటి సరఫరా సామర్థ్యం తగ్గడంతో సరిపడా నీరు సరఫరా కావడం లేదు. ధర్మపురి పట్టణానికి డబ్బా నుంచి 3 నెలలుగా మిషన్ భగీరథ నీరు సరఫరా కావడం లేదు. స్థానికంగా ఉన్న బోలి చెరువు ద్వారా నీటిని అందిస్తున్నారు. కోరుట్ల పట్టణం కేవలం మిషన్ భగీరథ మీదనే ఆధారపడి ఉంది. పుల్‌వాగు నుంచి పాతపైపులైన్‌ను తొలగించడంతో స్థానికంగా నీటి వనరులు లేకపోవడంతో కేవలం భగీరథ నీటిని సరఫరా చేస్తున్నారు. రెండు, మూడు రోజులకోకసారి, ఒక్కోసారి అంతకంటే ఎక్కువ రోజుల నీటి సరఫరా కావడం లేదు. జగిత్యాల పట్టణంలో నెల రోజులుగా భగీరథ నీరు రావడం లేదు. స్థానికంగా ఉన్న ధర్మసముద్రం నుంచి నీటిని రెండు, మూడు రోజులకోకసారి అందిస్తున్నారు. రాయికల్ పట్టణంలోనూ మిషన్ భగీరథ నీరు సక్రమంగా రాకపోవడంతో స్థానికంగా ఉన్న బావుల నుంచి నీటిని అందజేస్తున్నారు. మెట్‌పల్లి పట్టణంలో మిషన్ భగీరథ నీటిని అందజేయగా సరఫరా నిలిచిపోతే స్థానికంగా బోరుబావుల నీటిని అందిస్తున్నారు.

# నివేదిక సరే.. అవకతవకలపై చర్యలేవి?

వేములవాడ: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడలోని శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయానికి చెందిన తిప్పాపూర్ గోశాల నుంచి మూడో దఫా కోడెల పంపిణీలో జరిగిన అవకతవకలకు బాధ్యులపై చర్యలు లేనట్లు కనిపిస్తున్నాయి. మొదటిల్లో హడావుడి చేసిన జిల్లా యంత్రాంగం ప్రస్తుతం పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాజన్న గోశాల నుంచి రైతుల పేరిట 66 కోడెలను వరంగల్ జిల్లా గీసుకొండకు చెందిన రాంబాబు తరలించిన అంశం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇందులో కోడెలు పక్కదారి పట్టించిన రాంబాబుతో పాటు మరో ఇద్దరు వ్యక్తులను అక్కడి పోలీసులు అరెస్టు చేసిన విషయం విదితమే. కాగా వేములవాడలోని తిప్పాపూర్ రాజన్న గోశాల నుంచి మూడో దఫా 188 కోడెలు, ఆవులను ఆలయ అధికారులు కలెక్టర్‌కు చెప్పకుండా పంపిణీ చేశారు. మరోవైపు ఇందులో అవకతవకలు చోటు చేసుకున్నాయి. మూడో దఫా పంపిణీపై సమగ్ర నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. గత నెల 17న గోశాల పటిష్ఠ నిర్వహణకు తీసుకోవాల్సిన అంశాలపై నిర్వహించిన సమీక్షాసమావేశంలో ఆలయ అధికారులకు ఈ విషయం స్పష్టం చేశారు. ఇందుకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని



కలెక్టర్ పేర్కొన్నప్పటికీ ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ఆలస్యంపై అనుమానాలు..**

రాజన్న గోశాలలో కోడెల పంపిణీ పారదర్శకంగా చేసేందుకు విధి విధానాలను రూపొందించారు. కలెక్టర్ ఛైర్మన్‌గా, పశువైద్యాధికారి, జిల్లా వ్యవసాయాధికారి, ఆలయ ఈవో, స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులతో కలిసి కమిటీ వేశారు. ఈ కమిటీకి చెప్పకుండానే మూడో దఫా 188 కోడెలను పంపిణీ చేశారు. దీంతో ఆలయ అధికారులపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మొదటి దఫా 1,278 కోడెలు, 75 ఆవులను, రెండో దఫా 389 కోడెలు, 45 ఆవులను కలెక్టర్ అనుమతితో పంపిణీ చేసినప్పటికీ మూడోసారి ఇష్టానుసారంగా చేశారు. ఇందులో అవకతవకలు చోటుచేసుకోవడం పెద్ద ఎత్తున దుమారం రేగింది. ఇందులో గోశాల పర్యవేక్షకులు, సిబ్బంది ప్రమేయం ఉందనే అనుమానాలు వ్యక్తమయ్యాయి. దీనిపై వివిధ రాజకీయ పార్టీల నాయకులు కూడా ఆందోళనలు చేశారు. అవకతవకలపై ఆలయ అధికారులు నివేదిక సమర్పించినప్పటికీ బాధ్యులపై చర్యలు తీసుకోకపోవడం విమర్శలకు తావిస్తోంది. ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం స్పందించి బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని భక్తులు కోరుతున్నారు.

# గ్రామీణ రైల్వే స్టేషన్లపై శీతకన్ను

పెద్దపల్లి: రహదారులు కూడా సరిగా లేని మారుమూల గ్రామాలకు రైలు ప్రయాణాలే ఆయువుపట్టుగా మారాయి. ఆటోలు, బస్సులు లేని రోజుల్లో రైలు కూతతో పరుగుపెట్టి గమ్యస్థానాలకు చేరుకునేవారేందరో జిల్లాలో ఉన్నారు. 95 ఏళ్ల క్రితం నిర్మితమైన గ్రాండ్ ట్రంక్ రైలు మార్గంలో అనేక గ్రామాలకు రవాణా సౌకర్యం ఏర్పడి, ప్రజలకు రైలుతో విడదీయరాని అనుబంధం ఏర్పడింది కానీ.. కొన్ని నెలలుగా ఆదాయం రావడం లేదనే కారణంగా పలు స్టేషన్లలో రైళ్ల హాల్టింగ్ ఎత్తివేస్తుండటంతో అలంకార ప్రాయమవుతున్నాయి. రైలు టికెట్లను కాంట్రాక్టు పద్ధతిలో విక్రయించే గ్రామీణ స్టేషన్లలో క్రమంగా హాల్టింగ్‌లు ఎత్తివేస్తున్నారు.

**క్రమంగా హాల్టింగుల ఎత్తివేత**

రైల్వేశాఖ ఆదాయం తక్కువగా ఉండే స్టేషన్ల నిర్వహణ బాధ్యతను ప్రైవేటు వ్యక్తులకు అప్పగిస్తారు. బిజిగిరిషరీఫ్, పొత్కపల్లి, కొలనూరు, రాఘవపూర్, పెద్దంపేట స్టేషన్లలో టికెట్ బుకింగ్ వ్యవహారాలను గుత్తేదారు, ఇతర పనులను రైల్వే చూసుకుంటోంది. ఓదెల, కొత్తపల్లి రైల్వేస్టేషన్‌లో టికెట్ బుకింగ్ కౌంటర్‌తో పాటు స్టేషన్ పరిశుభ్రత నిర్వహణ బాధ్యతలను కాంట్రాక్టర్ నిర్వహించాల్సి ఉంటుంది. స్టేషన్‌కు వచ్చే ఆదాయంను బట్టి స్థాయిని నిర్ణయించి, నిర్వాహణ బాధ్యతలను విభజిస్తుంది కానీ.. ఆయా స్టేషన్లకు ఆదాయం పెంచేందుకు మాత్రం దృష్టిపెట్టిన దఖలాలు లేవు. ఉన్నంతలో ఓదెల రైల్వేస్టేషన్ ఒక్కటే రాబడి అధికంగా ఉండడంతో ఎక్కువ సంఖ్యలో రైళ్లకు హాల్టింగ్ కల్పించారు. మిగతా స్టేషన్లలో ఉన్న రైళ్ల హాల్టింగ్‌లే రద్దు చేశారు. కరోనా అనంతరం పలు ప్యాసింజర్ రైళ్లను కూడా ఎక్స్‌ప్రెస్ స్థాయికి మార్చి, గ్రామీణ స్టేషన్లలో హాల్టింగ్‌లు ఎత్తివేశారు.ఎక్స్‌ప్రెస్ స్థాయి నుంచి ప్యాసింజర్ స్థాయికి మారిన భాగ్యనగర్ రైలు రాఘవపూర్, పెద్దంపేటలతో ఆగుతుంది. ఈరైలు సికింద్రాబాద్ వైపు తెల్లవారు జామున, కాగజ్‌నగర్ వైపు రాత్రి సమయంలో వెలుతుండటంతో గ్రామీణ ప్రజలకు పెద్ద ప్రయోజనం కలగడం లేదు. కొత్తపల్లి రైల్వేస్టేషన్‌లో ఆగడం లేదు. రైల్వే యాప్‌లో హాల్టింగ్ ఉన్నట్లు చూపుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో మాత్రం రైలు ఆగకపోవడంతో రైళ్ల హాల్టింగ్‌లేని స్టేషన్‌గా కొత్తపల్లి మిగిలిపోయింది.

# పట్టుజారితే ఆసుపత్రికే!

ఎల్లారెడ్డిపేట : ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లిలో వాహనాల రద్దీని తగ్గించేందుకు వ్యవసాయ పొలాల గుండా బైపాస్ రహదారి నిర్మించారు. రాచర్ల గొల్లపల్లి బస్టాండుకు వెళ్లకుండానే గ్రామ చివరలోని బీసీ వసతి గృహం వరకు, అటు నుంచి రాజన్నపేట, కిష్టునాయక్‌తండా, అల్మాస్‌పూర్ గ్రామాల మీదుగా వీర్నపల్లి మండలంలోకి చేరుకోవచ్చు. ప్రతి శనివారం వారసంత, ఇతర రోజుల్లోనూ వాహనాలు ఎక్కువగా ఈ రోడ్డు గుండానే వెళ్తుంటాయి. వ్యవసాయ



పొలాలకు సమాన ఎత్తులో ఉండటం వల్ల సాగునీరు బైపాస్ రోడ్డు మీదుగా ప్రవహిస్తోంది. వాహనాల ధాటికి భారీ గుంతలు ఏర్పడి బురదమయంగా మారింది. వాహనదారులు పట్టు జారితే ప్రమాదానికి గురయ్యే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేయించాలని గ్రామస్థులు, వాహనదారులు కోరుతున్నారు. ఈ విషయంపై పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ సాగు నీటిని ఎక్కువగా పొలాల్లోకి మళ్లించడం వల్ల నీరు రోడ్డుపైకి చేరుతోందన్నారు. ఇటీవల రోడ్డుపై మట్టిని పోయించి, గుంతలను పూడ్చివేయించామని, పంట పొలాల కాల్వను సరిచేశామన్నారు. ఇతర చర్యలు కూడా చేపట్టి, ఇబ్బందులు తీర్చుతామని ఆయన పేర్కొన్నారు.

# 100 శాతం రుణమాఫీ అయిందని రాసిస్తే...

## బీఆర్ఎస్ ఎమ్మెల్యేలం రాజీనామా చేస్తాం.. రేవంత్ రెడ్డికి కేటీఆర్ సవాల్



రంగారెడ్డి : రాష్ట్రంలో ఏ ఒక్క ఊరిలోనైనా వంద శాతం రుణమాఫీ అయిందని రాసిస్తే.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలమంతా రాజీనామా చేస్తామని సీఎం రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సవాల్ విసిరారు. రంగారెడ్డి జిల్లా షాబాద్‌లో ఏర్పాటు చేసిన రైతు సభలో కేటీఆర్ పాల్గొని ప్రసంగించారు. ఇవాళ పేపర్లలో బెస్ట్ జోక్ చూసినా.. రేవంత్ రెడ్డి ఢిల్లీకి పోయిండు.. అక్కడ స్పీచ్ ఇస్తుండు.. తెలంగాణలో మొత్తం ఉద్ధరించిన.. ఢిల్లీలో కూడా ఉద్ధరిస్తానని, మీరు నా మాట నమ్మి కాంగ్రెస్ పార్టీకి అధికారం ఇవ్వండి. తెలంగాణలో ఆరు గ్యారెంటీలు అమలు చేశాం.. రుణమాఫీ చేశాను. 100 రోజుల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకున్నా.. ఢిల్లీలో కూడా అదే చేస్తానని రేవంత్ రెడ్డి చెబుతున్నాడు. అమ్మకు అన్నం పెట్టనోడు చిన్నమ్మకు బంగారు గాజులు చేయిస్తాడా..? కూట్లో రాయి తీయనోడు.. ఏట్లో రాయి తీస్తాడా..? సీఎం అబద్ధాలు చెప్పొచ్చునా..? ఆరు గ్యారెంటీలలో అర గ్యారెంటీ అమలైంది.. అది కూడా ఫ్రీ బస్సు. మా ఊరికి బస్సే దిక్కు లేదు అని కొందరు లొల్లి పెడుతున్నరు. మీరు తిట్టే తిట్లకు రోషమున్నడు అయితే బకెట్లో నీళ్లు నింపుకుని దాంట్లో దూకి చచ్చిపోతాడు. కానీ ఆయన రేవంత్ రెడ్డి.. ఆయనకు రోషం, సిగ్గు లేదు. అబ్దదాలు చెప్పుడు ఆయనకు అలవాటు. ఒక్క మాట అడుగుతున్నా.. ఊర్లల్లో ఒక మాటిస్తే, బాకీ ఇస్తే తిరిగి ఇవ్వకపోతే కేసు పెడుతాం.. 420 కేసు పెడుతాం.. చీటింగ్ చేసిండు అని. మరి ఇన్ని మోసాలు చేసిన కాంగ్రెస్ సర్కార్‌ను విడిచి పెడుదామా..? అని కేటీఆర్ ప్రజలను అడిగారు. రైతులను రుణమాఫీ పేరిట మోసం చేసిండు. రూ. 2 లక్షల రుణాలను మాఫీ చేసేందుకు డిసెంబర్ 9న సంతకం పెడుతా అన్నాడు. కానీ పూర్తిగా రుణమాఫీ కాలేదు. నీకు నిజాయితీ ఉంటే.. నీ సొంతూరు కొండారెడ్డిపల్లెకు పోదాం.. కొడంగల్‌కు పోదాం.. రుణమాఫీ అయిందని చెప్తే రాజీనామా కాదు రాజకీయ సన్యాసం తీసుకుంటానని అసెంబ్లీలో చెప్పాను. ఉలుకు పలుకు లేదు. రాష్ట్రంలో ఏ ఊరికైనా సరే.. డేట్, ప్లేస్, టైమ్ నీ ఇష్టం.. నువ్వు కాకపోతే నీ మంత్రులను పంపించు. వంద శాతం రుణమాఫీ అయిందని రాసిస్తే మొత్తం బీఆర్ఎస్ నేతలు రాజీనామా చేసి పోతాం. చారణా రుణమాఫీ కూడా కాలేదు. కానీ ఇవాళ డిల్లీకి పోయి రుణమాఫీ చేసిన అని రేవంత్ రెడ్డి మాట్లాడుతున్నాడని కేటీఆర్ నిప్పులు చెరిగారు. కేసీఆర్ మీకు బిచ్చమేసినట్టు రైతుబంధు కింద రూ. 10 వేలు ఇస్తుండు.. నన్ను గెలిపిస్తే రూ. 15 వేలు ఇస్తానని అన్నాడు. ఏడాది దాటిపోయింది.. ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు. ఎన్నికలప్పుడు 7600 కోట్లు రైతుబంధు వేసేందుకు మేం సిద్ధమైతే ఈసీకి ఉత్తరం రాసిండు రేవంత్ రెడ్డి. ఈ టైమ్‌లో వేస్తే కేసీఆర్‌కు ఓట్లు వేస్తారని చెబితే మోదీ ప్రభుత్వం ఆపింది. ఎన్నికలు అయిపోయాక రైతులను ఇబ్బంది పెట్టిండు. కేసీఆర్ హయాంలో నాట్లప్పుడు రైతుబంధు పడుతుండే.. ఇప్పుడు ఓట్లప్పుడు పడుతున్నాయి. కేసీఆర్ జమ చేసిన రూ. 7600 కోట్లను పార్లమెంట్ ఎన్నికల్లో ఓట్లప్పుడు వేసిండు. వానాకాలం పంటకు రైతుబంధు ఇవ్వలేదు. అందుకే ఇవాళ ధర్నా పెట్టాం. ఎందుకంటే.. ఇది ప్రారంభం మాత్రమే.. రాష్ట్రమంతా ధర్నాలు పెడుతాం. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం 15 వేలు ఇవ్వాలి రైతుభరోసా. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. వానాకాలం రైతుబందును ఎగ్గొట్టిండు.. దాన్ని కూడా విడిచి పెట్టొద్దు అని కేటీఆర్ చెప్పారు.

# కొత్త రేషన్ కార్డులపై ప్రభుత్వం కీలక నిర్ణయం



కరీంనగర్: జనవరి 26 నుంచి కొత్త రేషన్ కార్డులు అందజేస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. తెలంగాణలో 2 కోట్ల 81 లక్షల మందికి ఇప్పటికే 90 లక్షల రేషన్ కార్డులు ఉన్నాయని తెలిపారు. ప్రజా పాలనపై ప్రతిపక్షాలు కావాలని రాజకీయం చేస్తున్నాయని విమర్శించారు. పాత రేషన్ కార్డులు తొలగించడం లేదని స్పష్టం చేశారు.కుల సర్వే ఆధారంగా కొత్త రేషన్ కార్డులు ఇస్తామని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రకటించారు. కాగా.. ఆరు గ్యారెంటీలను రేవంత్ ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలు చేస్తుంది. ఆరు గ్యారెంటీల్లో భాగంగా ఇప్పటికే పలు హామీలను రేవంత్ ప్రభుత్వం అమలు చేసింది. ఈ మేరకు రేషన్ కార్డులపై రేవంత్ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. కొత్త రేషన్ కార్డులను ఈ నెల26 నుంచి జారీ చేస్తున్నట్లు ప్రకటించింది. అందుకు సంబంధించిన మార్గదర్శకాలను కూడా ప్రభుత్వం విడుదల చేసిన విషయం తెలిసిందే. కులగణన సర్వే ఆధారంగా తయారు చేసిన రేషన్ కార్డులు లేని కుటుంబాల జాబితాను జిల్లా కలెక్టర్లతోపాటు జీహెచ్ఎంసీ కమిషనర్‌కు క్షేత్రస్థాయి పరిశీలన కోసం పంపనుంది. మండల స్థాయిలో ఎంపీడీఓతోపాటు యూఎల్?బీలో మున్సిపల్ కమిషనర్ ఈ మొత్తం ప్రక్రియకు బాధ్యులుగా చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక జిల్లా స్థాయిలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) లేదా జీసీఎస్ఓ పర్యవేక్షకులుగా ఉండేలా ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

# హైదరాబాద్‌లో భారీగా డ్రగ్స్ పట్టివేత..

హైదరాబాద్: నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రగ్స్ స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు అంతరాష్ట్ర నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి 190 గ్రాముల హెరాయిన్, ద్విచక్రవాహనం, మొబైల్స్ సహా ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నారు. వీటి మొత్తం విలువ రూ. 23 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. మీడియాకు రాచకొండ కమిషనరేట్ సీపీ సుధీర్ బాబు వివరాలు తెలిపారు. నిందితులు రాజస్థాన్‌కు చెందిన మహేష్, మహిపాల్ గుర్తించినట్లు చెప్పారు. హైదరాబాద్‌లో అధిక ధరలకు నిందితులు హెరాయిన్ విక్రయిస్తున్నారని అన్నారు. నిందితులు రాజస్థాన్‌కు చెందిన వారైనా నేరేడ్మెట్ పరిధిలో స్థిరపడ్డారని అన్నారు. వినియోగదారులకు డ్రగ్స్ చేరవేయడంలో డిఫరెంట్ మెథడ్స్ వాడుతున్నారన్నారు. నిందితులు గ్యాస్ సిలిండర్ రిపేర్లు చేసే వారిగా పనిచేస్తున్నారని తెలిపారు. గ్యాస్ రిపేర్‌కు సంబంధించిన పరికరాల్లో ప్యాక్ చేసి డ్రగ్స్ సరఫరా చేస్తున్నారని అన్నారు. గ్యాస్ సిలిండర్ వాల్వ్‌లలో ప్యాక్ చేసి విక్రయిస్తున్నారని తెలిపారు. అనుమానం రాకుండా ఇలాంటి టెక్నిక్స్ వాడుతున్నారని చెప్పారు. వోలా, ఊబర్, రాపిడో సహా ఇతర మార్గాల ద్వారా వీటిని కస్టమర్లకు చేరవేస్తున్నారన్నారు. 200 గ్రాముల హెరాయిన్ లక్ష రూపాయలకు కొనుగోలు చేసి... దానిని దాదాపు రూ. 23 నుంచి 25 లక్షల వరకు విక్రయిస్తున్నారన్నారు. రాజస్థాన్‌కు చెందిన శంషుద్దీన్ అనే డ్రగ్ పెడ్లర్ నుంచి నిందితులు డ్రగ్స్ కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. 2024 నుంచి ఇప్పటి వరకు రాచకొండ పరిదిలో దాదాపు రూ. 88 కోట్ల విలువైన డ్రగ్స్ సీజ్ చేశామని తెలిపారు. కమిషనరేట్ పరిధిలో డ్రగ్స్‌ను పూర్తిగా నిర్మూలించేందుకు నిరంతరం కృషి చేస్తూనే ఉంటామని చెప్పారు. పిల్లలు, యువత ఇలాంటి మత్తు పదార్థాలకు బలికావద్దంటే... ప్రజల సహకారం కూడా కావాలని చెప్పారు. డ్రగ్స్ సమాచారం ఉంటే తమకు తెలియజేయాలన్నారు.


ప్రభాత సమాచారం
తెలంగాణ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను...

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో బ్యూరో ఇంచార్జీలు, స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇంచార్జీలు, డివిజన్ ఇంచార్జీలతో పాటు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను. అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి కలిగిన వారు సంప్రదించండి.

సయ్యద్ కరీం ఎడిటర్

9440977660, 9110718194





# సింగపూర్‌లో సీఎం రేవంత్ కీలక ఒప్పందం..

## వేల సంఖ్యలో ఉద్యోగాలకు అవకాశం..!

హైదరాబాద్ : తెలంగాణ అభివృద్ధి ఎలా? ఎనర్జీ రంగంలో తీసుకురావల్సిన మార్పులేంటి? రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే కంపెనీలేవి? ఇవే అంశాలు టార్గెట్‌గా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సింగపూర్‌లో పర్యటిస్తున్నారు. అక్కడ మూడు రోజుల పర్యటన తర్వాత దావోస్ చేరుకోనుంది. స్విట్జర్లాండ్‌లోని దావోస్ వేదికగా జరుగుతోన్న వరల్డ్ ఎనకామిక్ ఫోరమ్ వార్షిక సదస్సులో పాల్గొంటారు. సింగపూర్ పర్యటనలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బిజీగా గడుపుతున్నారు. తొలిరోజు సింగపూర్ విదేశాంగ మంత్రి వివియన్ బాలకృష్ణతో సీఎం రేవంత్ రెడ్డి బృందం సమావేశమైంది. ఈ సందర్భంగా మౌలిక వసతుల అభివృద్ధి, ఇంధనం, గ్రీన్ ఎనర్జీ, పర్యాటక రంగం సహా పలు విభాగాల్లో భాగస్వామ్యంపై చర్చించారు. విద్యార్థులు, యువతకు నైపుణ్య శిక్షణనిచ్చి ఉద్యోగ సంసిద్ధులుగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కంకణం కట్టుకుంది. ఇందులో భాగంగా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ సింగపూర్ ప్రభుత్వ ఆధీనంలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐటిఇ) సంస్థతో శుక్రవారం నాడు ఎంఓయు కుదుర్చుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటి, పరిశ్రమల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, స్పెషల్ సీఎస్ జయేశ్ రంజన్ సమక్షంలో యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ సుబ్బారావు, ఐటిఇ డిప్యూటీ డైరెక్టర్ ఫాబియన్ చియాంగ్ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. సింగపూర్ ఐటిఇ పదో తరగతి చదివే విద్యార్థుల స్థాయి నుంచి, చదువు పూర్తి చేసిన యువతకు నిపుణ్యం కలిగిన విద్యను అందించాలని నిర్ణయించారు. ఆసక్తి ఉన్న ఏ వయసు వారికైనా పరిశ్రమలు, ఐటి సంస్థల సహకారంతో జాబ్ రెడీ శిక్షణనిస్తుంది. 'స్కిల్స్ ఫర్ ఫూచర్, స్కిల్స్ ఫర్ లైఫ్' అనే నినాదంతో పనిచేస్తున్న ఐటిఇ లో ప్రస్తుతం 28 వేల మంది శిక్షణ పొందుతున్నారు. మొత్తం వంద ఫుల్ టైమ్ కోర్సులకు ఆన్‌లైన్, క్యాంపస్ శిక్షణ దొరుకుతుంది. ఐటిఇకి ఐదు వేల పరిశ్రమలతో భాగస్వామ్యం ఉంది. పరిశ్రమలు తమకు అవసరమైన మానవ వనరులకు నేరుగా శిక్షణనిచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాయి. అదే స్ఫూర్తితో ఏర్పాటైన యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ తన శిక్షకులకు ఐటిఇ తో ట్రెయినింగ్ (ట్రెయినింగ్ ఫర్ ట్రెయినర్స్) ఇప్పించేలా ఒప్పందరం కుదుర్చుకుంది. తాజా ఎంఓయు వల్ల సింగపూర్ ఐటిఇ పాఠ్యాంశాలను (కరికులమ్) మనం ఉపయోగించుకునే వీలు కలుగుతుంది. గురువారం(జనవరి 16) సాయంత్రం ఢిల్లీ నుంచి బయలుదేరిన సీఎం రేవంత్ రెడ్డి బృందం సింగపూర్ చేరుకుంది. అక్కడ మూడు రోజుల పర్యటన తర్వాత దావోస్ చేరుకోనుంది. స్విట్జర్లాండ్‌లోని దావోస్ వేదికగా జరుగుతోన్న వరల్డ్ ఎనకామిక్ ఫోరమ్ వార్షిక సదస్సులో తెలంగాణ పెవిలియన్ స్పెషల్ అట్రాక్షన్‌గా నిలవనుంది. రాష్ట్రానికి పెట్టుబడులు రాబట్టడమే టార్గెట్‌గా సీఎం రేవంత్ పర్యటన సాగుతోంది. రాష్ట్రానికి పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా దావోస్ వేదికగా సీఎం రేవంత్ రెడ్డి , తెలంగాణ ఐటీ , పరిశ్రమలమంత్రి శ్రీధర్‌బాబు ప్రపంచ దిగ్గజ కంపెనీల ప్రతినిధులతో సమావేశం అవుతారు.

# సింగపూర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన.. ఆ దేశ విదేశాంగ మంత్రితో భేటీ





సింగపూర్: తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సింగపూర్‌లో పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా ఆ దేశ విదేశాంగ మంత్రి వివియన్ బాలకృష్ణన్‌తో భేటీ అయ్యారు. గ్రీన్ ఎనర్జీ, మూసీ పునరుజ్జీవనం, పర్యాటకం, విద్య, ఐటీ, నైపుణ్య నిర్మాణంపై వారు చర్చించారు. సీఎంతో పాటు ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్ భేటీలో పాల్గొన్నారు. గురువారం రాత్రి రేవంత్‌రెడ్డి బృందం దిల్లీ నుంచి బయలుదేరి సింగపూర్ వెళ్లింది. శుక్రవారం ఉదయం వివియన్ బాలకృష్ణన్‌తో వారు భేటీ అయ్యారు. ఆ దేశంలోని అభివృద్ధి పనులతో పాటు తెలంగాణలోని ప్రణాళికలపై ప్రధానంగా చర్చించారు. రాష్ట్రంలో కొత్తగా ప్రారంభమైన క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ, దానికున్న అవకాశాలపై చర్చ జరిపారు. సింగపూర్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులు, రాష్ట్రంలో జరుగుతున్న అంశాలను పోల్చి చూశారు. నిధుల సమీకరణ గురించి సమాలోచనలు చేశారు. రాష్ట్ర బృందం శని, ఆదివారాల్లో కూడా సింగపూర్‌లో పర్యటించనుంది. చాంగి నగరంలో సింగపూర్ స్కిల్ యూనివర్సిటీ ఉంది. రాష్ట్రంలో కూడా స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేయబోతున్న నేపథ్యంలో ఆ దేశంలోని కోర్సులు, ప్రణాళికలు, నిర్వహణ విధానంపై అధ్యయనం చేయనున్నారు. వీటిపై ఒప్పందాలు జరిగే అవకాశం ఉంది. సింగపూర్‌లోని పారిశ్రామిక వేత్తలు, ప్రవాస భారతీయులతో కూడా సీఎం రేవంత్‌రెడ్డి భేటీ కానున్నారు. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలపై చర్చించనున్నారు. ఈ పర్యటన అనంతరం రాష్ట్ర బృందం దావోస్ వెళ్లనుంది. ప్రపంచ ఆర్థిక ఫోరం సదస్సులో పాల్గొననుంది. రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను సీఎం ఈ వేదికపై వివరించనున్నారు. గతంలో సుమారు రూ.40 వేల కోట్ల పెట్టుబడులు తీసుకువచ్చిన నేపథ్యంలో.. ఈసారి మరింత ఎక్కువ పెట్టుబడులు తీసుకురావాలనే యోచనలో ఉన్నారు. హైదరాబాద్‌ను ఫ్యూచర్ సిటీగా ఫోకస్ చేయడంతో పాటు కొత్తగా తెచ్చిన క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీని వివరించనున్నారు.


# ఇంటర్ విద్యార్థులకు అలర్ట్..

## 25వ తేదీ వరకు ఫీజు చెల్లింపునకు అవకాశం

హైదరాబాద్ : ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ విద్యార్థులను ఇంటర్మీడియట్ బోర్డు అప్రమత్తం చేసింది. వార్షిక పరీక్షలకు సంబంధించిన ఫీజును ఇప్పటికీ చెల్లించని విద్యార్థులు.. ఆలస్య రుసుం రూ. 2500తో జనవరి 25వ తేదీ వరకు చెల్లించేందుకు అవకాశం కల్పించింది. ఇంటర్ రెగ్యులర్, వొకేషనల్ విద్యార్థులతో పాటు ప్రయివేటు విద్యార్థులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించింది. మిక్స్‌డ్ ఆక్యుపెన్సీ భవనాల్లో ఉన్న ప్రైవేట్ జూనియర్ కాలేజీలకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి మినహాయింపు ఇచ్చిన సంగతి తెలిసిందే. 2024-25 విద్యాసంవత్సరానికిగానూ ఫైర్ నిరభ్యంతర పత్రం(ఎన్‌వోసీ) నుంచి మినహాయింపు ఇచ్చింది. ఈ మేరకు హోంశాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రవి గుప్తా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

మిక్స్‌డ్ ఆక్యుపెన్సీ కాలేజీలకు అనుమతివ్వాలన్న ప్రైవేట్ కాలేజీల విజ్ఞప్తితో ఈ ఒక విద్యాసంవత్సరానికి అనుమతినిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వ నిర్ణయంతో దాదాపు 217 కాలేజీల్లోని 70 వేల మంది విద్యార్థులకు ఊరట కలిగింది. ఈ క్రమంలో ఆ విద్యార్థులు విద్యా సంవత్సరం కోల్పోవద్దనే ఉద్దేశంతో వార్షిక పరీక్షల ఫీజు చెల్లించేందుకు ఇంటర్ బోర్డు అవకాశం కల్పిస్తూ నిర్ణయం తీసుకుంది. ఇక ఇంటర్ వార్షిక పరీక్షలను మార్చి 5 నుంచి 25 వరకు నిర్వహించనున్నారు. ఫస్టియర్ విద్యార్థులకు మార్చి 5 నుంచి, సెకండియర్ విద్యార్థులకు మార్చి 6 నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రతి రోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలను నిర్వహించనున్నారు.

# గత ప్రభుత్వం చేసింది వడ్డీ మాఫీనే: ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



హైదరాబాద్: సన్నాలు పండిస్తే తెలంగాణలో రైతులకు రూ.500 బోనస్ ఇస్తున్నట్లు కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి తెలిపారు. దేశంలో ఎక్కడా రూ.500 బోనస్ ఇవ్వట్లేదని చెప్పారు. హైదరాబాద్‌లోని సీఎల్పీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రేషన్ కార్డుల జారీని గత ప్రభుత్వం మర్చిపోయిందని విమర్శించారు. ఈ నెల 26 నుంచి వీటి జారీ కార్యక్రమం జరుగుతుందని వివరించారు. "గత ప్రభుత్వం రుణమాఫీ చేయలేదు.. వడ్డీ మాఫీ చేసింది. వరంగల్ డిక్లరేషన్‌లో ఇచ్చిన మాట ప్రకారమే రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశాం. రుణమాఫీ కోసం కేంద్రం నుంచి రూ.10 వేల కోట్లు సాయం చేసి ఉంటే ప్రభుత్వానికి ఉపయోగపడేది" అని జీవన్‌రెడ్డి తెలిపారు

# సైఫ్‌పై దాడి.. ఒకరిని అదుపులోకి తీసుకున్న పోలీసులు

ముంబయి: బాలీవుడ్ నటుడు సైఫ్ అలీఖాన్‌పై దాడి ఘటనను పోలీసులు తీవ్రంగా పరిగణిస్తోన్న విషయం తెలిసిందే. దాడికి పాల్పడిన నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం ఈ కేసుతో సంబంధం ఉన్నట్లు అనుమానిస్తోన్న ఒక వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. బాంద్రాలోని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి అతడిని పలు విషయాలపై ప్రశ్నిస్తున్నారు. దాడి చేయడానికి గల కారణమేమిటన్న కోణంలో విచారిస్తున్నారు.

**20 బృందాలుగా పోలీసులు:** గురువారం తెల్లవారుజామున 2.30 గంటలకు దాడి ఘటన చోటుచేసుకుంది. సైఫ్, అతడి కుటుంబసభ్యులు నిద్రలో ఉండగా.. ఇంట్లోకి చొరబడిన దుండగుడు చోరీకి యత్నించాడు. సైఫ్ అడ్డుకునేందుకు ప్రయత్నించగా దాడి చేసి పరారయ్యాడు. ఈమేరకు కేసు నమోదు చేసుకున్న ముంబయి పోలీసులు అన్ని విధాలుగా దర్యాప్తు చేపట్టారు. నిన్న రాత్రి నిందితుడి ఫొటోను రిలీజ్ చేశారు. అతడిని పట్టుకునేందుకు పోలీసులు 20 బృందాలుగా ఏర్పడి గాలింపు చర్యలు చేపట్టారు. బాంద్రా రైల్వేస్టేషన్ వద్ద అతడు చివరిసారి కనిపించాడని పోలీసులు తెలిపారు. ఘటన తర్వాత అతడు వసాయి-విరార్ ప్రాంతాలవైపు లోకల్ ట్రైన్‌లో ప్రయాణం చేసినట్లు వారు అనుమానిస్తున్నారు.

**ఆస్పత్రిలో సైఫ్..:** ఈ దాడిలో సైఫ్ తీవ్రంగా గాయపడ్డారు. లీలావతి ఆస్పత్రిలో ఆయన చికిత్స పొందుతున్నారు. శస్త్రచికిత్స చేసి 2.5 అంగుళాల బ్లేడ్ ముక్కను వైద్యులు బయటకు తీశారు. ఎడమ చేతికి, మెడ కుడి భాగానికి అయిన గాయాలకు ప్లాస్టిక్ సర్జరీ చేశారు. సైఫ్‌కు ప్రాణాపాయం లేదని ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ నీరజ్ ఉత్తమాని తెలిపారు. ప్రస్తుతం ఆయన ఆస్పత్రిలోనే ఉన్నారని ఇంకొన్ని రోజులు అక్కడే ఉండే అవకాశం ఉందని సమాచారం.

PRINTED, PUBLISHED, EDITED AND OWNED BY SYED. KAREEM. PRINTED AT MUZAMMIL PRINTERS BOKKALGUDA, ADILABAD-504001
PUBLISHED AT D.NO. 4-4-122/10/B, VIDYANAGER, ADILABAD - 504001. TELANGANA STATE, REGD. NO. APTEL/2011/41055 ìEDITOR : SYED. KAREEMî CELL - 94409 77660